క్లుప్తంగా

21న మెగా రక్తదాన శిబిరం

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 21న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగే రక్తదాన శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు కాలభైరవ అష్టమి పూజలు



కాలభైరవ స్వామి ఆలయం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఉన్న కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు తెలిపారు. ధనుర్మాసంలో వచ్చే తొలి అష్టమిని కాలభైరవ అష్టమిగా జరుపుతారు. ఈ నేపథ్యంలో స్వామివారికి బుధవారం అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరిస్తారన్నారు. స్వామివారికి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించే భక్తులు ఉదయం 8 గంటలకే ఆలయంలో ఉండాలన్నారు. పూజల అనంతరం స్వామివారి ప్రసాద వితరణ జరుగుతుందని ఈఓ చెప్పారు.

బైక్ ఢీకొని పాదచారుడికి తీవ్ర గాయాలు

సామర్లకోట: మోటార్ బైక్ ఢీకొన్న సంఘటనలో పాదచారుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపురం రోడ్డులో మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. పెద్దాపురం నుంచి సామర్లకోట వస్తున్న మోటార్ బైక్.. హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతున్న పాదచారుడు గోపాలంను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన గోపాలం రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సామర్లకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

సామర్లకోట: తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు వేట్లపాలెం శివారు జోన్నలదొడ్డిలోని ఓ పాన్‌షాపుపై మంగళవారం దాడి చేశారు. అక్కడ మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించి, మొత్తం 60 మద్యం బాటిళ్లు (180 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో ఈ దాడి చేశారు. నిందితుడు బత్తుల సత్యనారాయణను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్టు సీఐ తెలిపారు.

న్యాయవాదుల నిరసన

పెద్దాపురం: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని పెద్దాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం నిరసన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షులు వేదల మణి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు హాల్ నుంచి మున్సిపల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు న్యాయవాదులు మద్దతు పలికారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

పెద్దాపురం: తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మె మంగళవారం ఎనిమిదో రోజుకు చేరింది. సీఐటీయూ నాయకుడు డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్లను వివరించారు. తొలుత మున్సిపల్ సెంటర్ వద్ద అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ నాయకులు దాడి బేబీ, నాగమణి, అమల, ఎస్తేరురాణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంలో ముందంజ

కాకినాడ: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2024లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో జిల్లాలో కాకినాడ సిటీ నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని ఈఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారంపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. వచ్చిన 1,08,521 దరఖాస్తుల్లో దాదాపు 94,676 పరిష్కరించామన్నారు. 10,990 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

చెరువుకు జీవం

- నిర్లక్ష్యంతో నిర్జీవంగా మారిన కోట్లమ్మ చెరువు
- ప్రభుత్వ చొరవతో సుందరంగా రూపుదిద్దుకోనున్న వైనం
- తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.26 కోట్లు..
- రూ.1.30 కోట్ల అమృతధార నిధుల మంజూరు



అమృతధార ఏఈతో కలిసి కోట్లమ్మ చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సామర్లకోట: దీర్ఘకాలంగా సమస్యగా ఉన్న కోట్లమ్మ చెరువుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రభుత్వం నుంచి అమృతధార నిధులు మంజూరు కావడంతో, తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.26 కోట్లు, కోట్లమ్మ చెరువు అభివృద్ధికి రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో కోట్లమ్మ చెరువు పనులు వేగంగా జరుగుతున్నాయి.

పట్టణంలో పేద ప్రజలు నివసించే ప్రాంతంలో ఉన్న కోట్లమ్మ చెరువు అక్కడి ప్రజల అవసరాలు తీర్చేది. ఈ చెరువు ఎర్ర నేలతో ఉండటం వల్ల నీరు ఎంతో రుచిగా ఉండేది. క్రమేపీ చెరువును అధికారులు నిర్లక్ష్యం చేయడంతో తుప్పలు పెరిగి, బహిరంగ మరుగుదొడ్డిగా మారిపోయింది. చెరువులో చుక్క నీరు లేకుండా పోయింది. గత 15 ఏళ్లుగా కోట్లమ్మ చెరువు అభివృద్ధిపై అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తోట గోపాలకృష్ణ, పంతం గాంధీమోహన్, నిమ్మకాయల చినరాజప్ప ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. కాకినాడ రోడ్డులో స్పెక్ట్రామ్ పవర్ ప్లాంటుకు చెందిన చెరువు పనులు జరిగే సమయంలో పైపులైన్ ధ్వంసమైంది. దాంతో చెరువులో నీరు లేకపోవడంతో అక్కరకు రాకుండా పోయింది.

చెరువు అభివృద్ధికి నిధులు

ప్రతి మున్సిపాలిటీలోను ఒక చెరువును అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని కోట్లమ్మ చెరువును ఎంపిక చేసి, దీని అభివృద్ధికి అమృతధార నుంచి రూ.1.30 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయి. పనులను పర్యవేక్షించడానికి అమృతధార పథకం అధికారులు మంగళవారం చెరువు పనులను కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ ఏఈ అరవింద్‌తో కలిసి పరిశీలించారు. చెరువు అభివృద్ధిలో భాగంగా పూడిక తీయడంతో పాటు గట్టు పటిష్టం చేసి, చెరువు చుట్టూ మొక్కలు నాటి, పార్కింగ్ ప్రదేశం, వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తారు. గత టీడీపీ హయాంలో నేతలు హామీలుగా వదిలేసిన నీలమ్మ చెరువు, కోట్లమ్మ చెరువు అభివృద్ధిపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది.

ఆరు ఎకరాల్లో అభివృద్ధి పనులు



సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కోట్లమ్మ చెరువులో నాలుగు అడుగుల వరకు పూడిక తీశాం. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మొక్కలతో పార్కు అభివృద్ధి చేస్తాం. ఓపెన్ జిమ్, పిల్లల ఆట పార్కు ఏర్పాటు చేస్తాం. కోట్లమ్మ చెరువును స్వచ్ఛమైన నీటితో నింపి, ఆహ్లాదకరమైన వాతావరణంలో చెరువును తయారు చేస్తాం. చెరువు చుట్టూ ఉన్న మార్గాలను మూసివేసి, పోలీసు స్టేషన్ వైపు ఉన్న మార్గం ద్వారా ప్రవేశం కల్పిస్తాం. చెరువు అభివృద్ధికి రూ.1.30 కోట్లతో టెండరు పనులను విశాఖపట్నానికి చెందిన కాంట్రాక్టరు చేస్తున్నారు. జనవరి మొదటి వారం నాటికి పనులు పూర్తవుతాయి.

– కిషోర్, అమృతధార ఏఈ, విజయవాడ

తాగునీటి సమస్యకు చెక్



పట్టణ తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.26 కోట్లు అమృతధార నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఫిల్లర్‌తో పాటు పైపు లైన్ పనులు, కొత్త వాటర్ ట్యాంకులను నిర్మాణం జరుగుతాయి. వీటికి సంబంధించి ప్రణాళిక రూపొందించడానికి టెండర్లు ఆహ్వానించాం. పట్టణంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఈ నిధులను వినియోగిస్తాం. చెరువుల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారు. నీలమ్మ చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

– జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

తాత్కాలిక షాపుల ఏర్పాటుకు టెండర్ల స్వీకరణ

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న ఖాళీ స్థలంలో తాత్కాలిక షాపులు ఏడాది పాటు ఏర్పాటు చేసుకోవడానికి టెండర్లు స్వీకరిస్తున్నట్టు ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, అరటి పండ్ల దుకాణానికి రూ.లక్ష ధరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్ ఉండాలన్నారు. అదే విధంగా హోటల్ నిర్వహణకు రూ.లక్ష ధరావత్తు, రూ.10 లక్షల స్వాల్వెన్సీ, పండ్ల దుకాణానికి రూ.25 వేల ధరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ, ఆవు నెయ్యి దీపాల దుకాణానికి రూ.25 వేల ధరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ, పాదరక్షల దుకాణానికి రూ.25 వేల ధరావత్తు, రూ.రెండు లక్షల సాల్వెన్సీ, వాహనాల పార్కింగ్ ఫీజు వసూలుకు రూ.రెండు లక్షల ధరావత్తు, రూ.10 లక్షల సాల్వెన్సీ, ఆలయంలో భక్తులు కొట్టిన కొబ్బరికాయలో సగ భాగం తీసుకోవడానికి రూ.లక్ష ధరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ, దేవస్థాన ప్రాంగణంలో ఉన్న మామిడి చెట్ల కాయలు కోసుకోవడానికి రూ.రెండు వేల ధరావత్తు, రూ.50 వేల సాల్వెన్సీ ఉండాలని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30న ఉదయం 10లోపు టెండరు వేసి, తదుపరి బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు. ఈ నెల 27లోగా రూ.వెయ్యి చెల్లించి, టెండరు షెడ్యూల్ పొందాలని తెలిపారు.

సైన్సు ప్రాజెక్టుల్లో విజేతలు వీరే..



సైన్సు ప్రాజెక్టు విజేతలకు బహుమతులు అందజేసిన డీవైఈఓ డానియేల్‌రాజు, ఎంఈఓలు

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మండల పరిధిలో నిర్వహించిన సైన్సు ప్రాజెక్టు విజేతల వివరాలను మంగళవారం ప్రకటించారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల వ్యక్తిగత ప్రాజెక్టులు, విద్యార్థుల గ్రూప్ ప్రాజెక్టు నిర్వహించిన విషయం విదితమే. ఈ మేరకు విజేతలకు ఉప విద్యాశాఖాధికారి డానియేల్ రాజు, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య బహుమతులు అందజేశారు. టీచర్ల విభాగంలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కె.శేషారత్నం ప్రథమ, ఉండూరు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎస్.వీరభద్రరావు ద్వితీయ, తోట గోపాలకృష్ణ హైస్కూల్ ఉపాధ్యాయుడు కె.జగదీశ్వరరావు తృతీయ బహుమతులు సాధించారు. అదే విధంగా విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో సామర్లకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కె.గాయత్రి ప్రథమ, చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థి ఎస్.అభినయ్ ద్వితీయ, సామర్లకోట తోట గోపాలకృష్ణ హైస్కూల్ విద్యార్థి ఎం.జస్వంత్ తృతీయ బహుమతులు పొందారు. గ్రూపు కేటగిరీలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కె.జగదీష్, పి.దుర్గాప్రసాద్ ప్రథమ, నవర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బి.వెంకటసత్య, ఎం.వల్లీఅపర్ణ ద్వితీయ, జి.మేడపాడుకు చెందిన కె.ఇందిర, పి.శ్రీదేవి తృతీయ స్థానాలు సాధించారు.

ఓటరు జాబితా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారం

ఆర్డీఓ జేఎస్ రామారావు



వివిధ పార్టీల ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో మంగళవారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జేఎస్ రామారావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీసర్వేను మరింత వేగవంతంగా చేపట్టామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజాప్రతినిధులు మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటరు జాబితాపై ప్రజల్లో అపోహలు తొలగిపోవాలని, అందుకు వారికి పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఫారం-6కు 1,471, ఫారం-7కు 1,343, ఫారం-8కు 757 దరఖాస్తులు అందాయని వివరించారు. వాటిని సత్వరం పరిష్కరించాలని ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. అనంతరం ఓటర్ల జాబితా విధానంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, చింతా శ్రీనివాసరావు(వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ)తో పాటు ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పటిష్ట ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

అవగాహన ర్యాలీలో ఆర్డీఓ, డీఎస్పీ



ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ, డీఎస్పీ

పెద్దాపురం: ఓటు వేసే విధానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పటిష్ట ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు, డీఎస్పీ లతాకుమారి అన్నారు. స్థానిక మహారాణి కళాశాల నుంచి మున్సిపల్ సెంటర్ వరకు విద్యార్థులు మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ, డీఎస్పీ మాట్లాడారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ ఓటేసే ముందు ఆలోచించి, మంచి నిర్ణయాన్ని తీసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 జనవరిలోగా 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించినట్టు పేర్కొన్నారు. ఆ మేరకు అర్హత ఉన్నవారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక మున్సిపల్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, సీఐ రవికుమార్, ఎస్సై సురేష్, కళాశాల ప్రిన్సిపాల్ టి.వీరయ్యచౌదరి, ఏసుబాబు, డీటీ కాంతారావు, మున్సిపల్ ఆర్ఐ సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఈ-పంట ప్రక్రియను పూర్తి చేసుకోండి

రైతులను కోరిన జేడీఏ విజయ్‌కుమార్



వేట్లపాలెంలో ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీ విజయకుమార్

సామర్లకోట: రైతులు వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టి, వేగంగా వరినాట్లు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్.విజయకుమార్ అన్నారు. వేట్లపాలెం గ్రామంలో ఈ-పంట నమోదు ప్రక్రియను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దాళ్వా సాగు చేసే రైతులందరూ పంట రకం, విత్తన తేదీ, సర్వే నంబర్లకు సంబంధించిన నకలు కాపీలను రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి అందజేసి, ఈ-పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. దీనివల్ల రైతులు ఏ పంట వేస్తున్నారో ముందుగా తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. ఆయా రకాల వరి వంగడాలపై రైతులకు సూచనలివ్వడానికి వీలవుతుందన్నారు. మార్చి 31 నాటికి గోదావరి కాలువ మూసివేసే అవకాశాలున్న కారణంగా రైతులు సాగు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ-1121, ఎంటీయూ-1156, ఎంటీయూ- 1153ను వేయాలన్నారు. మిచాంగ్ తుపానులో పంట నష్టపోయిన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తెలుసుకునేలా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఏడీఏ జీవీ పద్మశ్రీ, ఎంఏఓ ఐ.సత్య, వీఏఏలు ఉన్నారు.

రమణక్కపేటలో వై ఏపీ నీడ్స్ జగన్



రమణక్కపేటలో సచివాలయం వద్ద పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఈఓపీ పీఆర్డీ భాస్కరరావు

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేట గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఈఓ పీఆర్డీ భాస్కరరావు ఆవిష్కరించారు. సెంటర్‌లో పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మసలయ్య, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

22న బభ్రువాహన నాటక ప్రదర్శన

బోట్‌క్లబ్: దంటు సూర్యారావు స్మారక నాటకోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న దంటు కళాక్షేత్రంలో సాయంత్రం ఐదు గంటలకు బభ్రువాహన పద్య నాటకం ప్రదర్శిస్తున్నట్టు యంగ్మెన్స్ హ్యాపీక్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోషకాల పెన్నిధి తాటి బెల్లం

- తమిళనాడు నుంచి వచ్చి స్థానికంగా విక్రయం
- ఖరీదు ఎక్కువైనా విరివిగా కొనుగోళ్లు



పిఠాపురంలో తాటిబెల్లం విక్రయిస్తున్న వ్యాపారి (అంతర చిత్రం) నోరూరించే తాటి బెల్లం

పిఠాపురం: తాటి చెట్టు ఉపయోగాలు అన్ని ఇన్నీ కాదు. తాటి కల్లు నుంచి ముంజెలు, తాటికాయలు, తాటితాండ్ర, తేగలు వంటి తినడానికి ఉపయోగపడితే వాటి బెరడు, ఆకులు ఇంటి నిర్మాణాలకు ఉపయోగిస్తారు. ఇలా తాటి చెట్టు బెరడు నుంచి ఆకుల వరకు అన్నీ మానవునికి ఉపయోగపడేవే. అలాంటి తాటి కల్లు నుంచి తయారు చేసే బెల్లానికి ఎనలేని గిరాకీ ఉంది. కుండకు సున్నం రాయడం ద్వారా అందులో పడే కల్లుకు తీయదనం వస్తుందని దానిని నీరా అంటారని వ్యాపారి చెప్పారు. పంచదారకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే ఆరోగ్య ప్రదాయినిగా చెప్పబడే బెల్లానికి ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది. మరిన్ని పోషక విలువలు, రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉన్న ఈ బెల్లానికి మరింత గిరాకీ పెరిగింది. ఎక్కువగా తమిళనాడుకు చెందిన వ్యాపారులు మన జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లోని మెయిన్ రోడ్లపై తాటి బెల్లాన్ని విక్రయిస్తున్నారు. కరోనా వంటి వ్యాధులు ప్రబలిన నేపథ్యంలో అందరూ పకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తుండడంతో దీని విక్రయాలు ఊపందుకున్నాయి. మామూలు బెల్లం కిలో రూ.50 వరకు ఉండగా తాటిబెల్లం కిలో రూ.140, మిరియాలు అల్లం వంటివి కలిపి తయారు చేసిన తాటిబెల్లం కిలో రూ.250 వరకు విక్రయిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి ప్రాంతంలో ఎక్కువగా ఈ బెల్లం తయారు చేస్తుంటామని అక్కడి నుంచి లారీలపై బెల్లం తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నామని ఆ ప్రాంతానికి చెందిన రైతు వీరన్ తెలిపాడు.

సమయం లేదు.. వెదజల్లే మేలు..

- నాట్లు త్వరగా పూర్తి చేయాలంటున్న అధికారులు
- రబీలో 15 వేల హెక్టార్లలో సాగుకు రైతులు సమాయత్తం
- కలుపు నివారణకు జాగ్రత్తలు అవసరం



గొల్లప్రోలు మండలంలో వరి విత్తనాలు వెదజల్లేందుకు సిద్ధం చేసిన పొలం

పిఠాపురం: తుపాను అలజడి తరువాత రైతన్నలు రబీ సాగు ప్రారంభించారు. ఈ ఏడాది త్వరిగా నాట్లు పూర్తి చేయాలన్న వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం సమయాభావం వల్ల వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వల్ల అధిక లాభాలు ఆర్జించడంతో పాటు పెట్టుబడులు తగ్గించ వచ్చన్న విషయాన్ని గ్రహించిన రైతులు ఆ పద్ధతిని అవలంబిస్తున్నారు. నియోజకవర్గంలో 42 వేల ఎకరాల్లో రబీ సాగు చేస్తుండగా ఖరీఫ్‌లో సుమారు 8 వేల హెక్టార్లకు పైగా వరి పంటను వెదజల్లే పద్ధతిలో సాగు చేశారు. ప్రస్తుత రబీలో సుమారు 15 వేల హెక్టార్ల వరకు వెదజల్లే పద్ధతిలో సాగు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సమయాభావం, కూలీల కొరత, పెరిగిన కూలి రేట్లు తదితర కారణాలతో కూడా వెదజల్లు పద్ధతే అనుకూలమని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ కోతలు, నూర్పులు, మాసూళ్లు పూర్తయ్యి రబీకి అవసరమైన సమయం రావడంతో విత్తనాలను వెదజల్లుతున్నారు. వీలున్నంత త్వరగా నాట్లు పూర్తి చేయాల్సి ఉన్న నేపథ్యంలో రైతులు నారు మళ్లు వేసి నాట్లు వేయడం ఆలస్యమౌతుందని భావిస్తున్నారు. దీంతో నేలను దమ్ముచేసి విత్తనాలను చల్లుతున్నారు. విత్తనం మొలకెత్తకపోతే తరువాత తీసుకొనే చర్యలపై వారు కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల పరిధిలో ఇప్పటికే చాలా మంది రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు. వెదజల్లడమే మేలని వ్యవసాయాధికారులు కూడా సూచిస్తున్నప్పటికీ, ఈ విధానం వల్ల పంటచేలో ఎక్కువగా కలుపు మొక్కలు వచ్చే అవకాశం ఉందని దీని నివారణ ఇబ్బంది అని రైతులు వాదిస్తున్నారు. ఈ సమస్యకు ముందుగానే మందులు వాడడం వల్ల కలుపు నివారించ వచ్చని అధికారులు భరోసా ఇస్తున్నారు. వెదజల్లిన చేలలో పక్షులు, క్రిమి కీటకాలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు వివరిస్తున్నారు. కలుపు నివారణకు జాగ్రత్తలు పాటించి ప్రకృతి సహకరిస్తే రబీలో మంచి దిగుబడుల వస్తాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వెదజల్లే పద్ధతి వల్ల లాభాలున్నాయి



ముందుగా నారుమళ్లు వేయాల్సిన పనిలేదు. దీనివల్ల నారుమడి తయారీకి అయ్యే ఖర్చుతో పాటు కూలీలు, దుక్కికి అయ్యే ఖర్చులు మిగులుతాయి. అలాగే ఆకుతీత నాట్లకు అయ్యే ఖర్చులు సైతం తగ్గుతాయి. సమయాభావం నివారించవచ్చు. నీరు ఎప్పుడు అందుబాటులో ఉంటే అప్పుడు వెదజల్లే పద్ధతిలో సాగు చేయవచ్చు. ప్రస్తుతం వరదలు, అధిక వర్షాల వల్ల సాగునీటి కాలువలకు గండ్లు పడి ఉండడంతో నీరు అధికంగా వచ్చినా వదిలినా పొలాలు ముంపునకు గురయ్యే వఆకాశం ఉండడంతో తక్కువ స్థాయిలో నీరు వదులుతారు కాబట్టి తక్కువ నీటితో వెదజల్లే పద్ధతిలో సాగు చేసుకోవడం చాలా మంచిది.

– స్వాతి, ఏడీఏ
వ్యవసాయ శాఖ, పిఠాపురం

రాష్ట్ర రగ్బీ జట్టుకు అజయ్ ఎంపిక



అజయ్‌తో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విత్తనాల అజయ్ రాష్ట్ర రగ్బీ జట్టుకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ మంగళవారం తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లోని నవీన్ పట్నాయక్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు జరిగే 67వ అఖిల భారత స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగంలో రగ్బీ ఆటల పోటీలలో రాష్ట్రజట్టు తరఫున అజయ్ ఆడతారన్నారు. ఆటల పోటీలలో పాల్గొనేందుకు వెళ్తున్న అజయ్‌ను మంగళవారం హెచ్‌ఎం సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ కె.నాగలింగేశ్వరరావు, వీవీ రమణమూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.